సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

- అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పిలుపు నిచ్చారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను సచివాలయంలోనే శనివారం నుంచి నెల రోజుల పాటు ఉచితంగా అందిస్తామన్నారు. ఇందులో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చూపించాలన్నారు. శనివారం నుంచి జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించడానికి మండల స్థాయి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజా సమస్యలను సంతృప్తిస్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.మండల స్థాయిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒక టీమ్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండో టీమ్, మండల ఇంజినీర్ ఆధ్వర్యంలో మూడో టీమ్‌గా ఏర్పడి, మండలంలో ప్రతి రోజూ రెండు సచివాలయాలకు వెళ్తారని, శనివారం నుంచి ఈ క్యాంపులు నిర్వహిస్తారన్నారు.

ప్రతి సచివాలయానికి నిధులు

చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ఆదాయం, కులం, బర్త్ సర్టిఫికెట్లు, కొత్త రేషన్ కార్డులు, సీసీఆర్‌సీ కార్డులు, ఆధార్‌కు బ్యాంకు లింకేజీ, ఆధార్ కార్డులో మార్పులు ఇవన్నీ కూడా ఈ కార్యక్రమం కింద చేపడతారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూరల్ నియోజకవర్గంలో ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల మంజూరుతో పాటు, అదనంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

సమావేశంలో పార్టీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గిరజాల వీర్రాజు, మింది నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్లు తాడాల చక్రవర్తి, తాటికొండ విష్ణు, రాజమౌళి, రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు దొంతంశెట్టి వీరభద్రయ్య, షకీలా బేగం, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్‌టీయూసీ, దివ్యాంగుల సెల్ అధ్యక్షులు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, ఇన్నీసుపేట బ్యాంకు వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బిల్డర్ చిన్న, వక్ఫ్‌బోర్డు మెంబర్ షట్టర్ బాషా, పార్టీ నాయకులు వెలుగుబంటి వెంకటాచలం, యెజ్జువాసు, బొప్పన సుబ్బారావు, తిరుమలశెట్టి శ్రీను, ఈలి గోపాలం పాల్గొన్నారు.

మెగా క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రోటరీ గవర్నర్ భాస్కరరామ్, ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక త్యాగరాజ నారాయణదాసు కల్యాణ మండపం ప్రాంగణంలో శుక్రవారం మాతృదేవోభవ మెగా క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, జీఎస్ఎల్ క్యాన్సర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల నిర్వహించే ఈ శిబిరాన్ని రోటరీ గవర్నర్, ప్రముఖ ఆడిటర్ వి.భాస్కరరామ్‌తో కలసి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధిని ముందుగా గుర్తించగలిగితే నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా మాట్లాడుతూ సుమారు నాలుగైదువేల రూపాయల విలువైన పరీక్షలను శిబిరంలో ఉచితంగా చేస్తున్నామన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్స్ చేసుకోని వారు సైతం నేరుగా వచ్చి పేర్లు నమోదు చేసుకుని పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. మహిళల్లో వచ్చే రొమ్ము, గర్భాశయ, గొంతు క్యాన్సర్లకు పరీక్షలు చేస్తామని, వ్యాధి నిర్ధారణ అయితే జీఎస్ఎల్‌లో ఆరోగ్య శ్రీలో వైద్యం అందుతుందన్నారు. శిబిరం నిర్వహణకు సహకరించిన జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రముఖ ఆంకాలజిస్ట్, డాక్టర్ తరుణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు, దంత, సాధారణ వైద్య సేవలు అందించారు.

నేటి నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి శిబిరాలను సజావుగా నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు శుక్రవారం 1 నుంచి 4 డివిజన్లలో తొమ్మిది సచివాలయాలకు సంబంధించి అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయంలో వివరాలు తెలియజేయడానికి హెల్ప్‌డెస్క్, స్పందన కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. లబ్ధిదారుల వివరాలు నమోదు చేసేందుకు రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఒకటో డివిజనకు సంబంధించి లాలాచెరువు సుబ్బారావుపేటలోని సచివాలయం, 2వ డివిజన్‌కు నారాయణపురం వాంబేగృహాల వద్దగల కమ్యూనిటీ హాలు, 3, 4 డివిజన్లకు రాజేంద్రనగర్‌లోని కమ్యూనిటీ హాలులో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్యాంపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనరు సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో పారా లీగల్ వలంటీర్లకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి న్యాయ సేవలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టం 1987, వివిధ నల్సా సంక్షేమ పథకాల గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, న్యాయవాది, ట్రైయిన్డ్ మీడియేటర్లు పి.శ్రీనివాసరావు, జి.కృష్ణ కపూర్, న్యాయవాది డి.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేష్ వివిధ చట్టాలు, భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా న్యాయస్థాన ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఇన్సూరెన్స్ సంస్థల అధికారులు, ఇరుపక్షాల న్యాయవాదులతో సమావేశమయ్యారు. జూలై 22న జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌లో వీలైనన్ని మోటారు వాహనాల కేసులకు పరిష్కారం చూపే దిశగా పని చేయాలని సూచించారు.

అన్యాక్రాంతమవుతున్న ఆస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

సీటీఆర్ఐ: ఏవీ అప్పారావు రోడ్డులోని బైబిల్ ప్లేస్ స్థలంలో ఉన్న చర్చ్ ఆఫ్ గాడ్ ఆఫ్ ప్రొఫసీ సంస్థ (సీఓజీఓపీ)కి చెందిన దేవాలయం, బిషప్ హౌస్, బాలికల అనాథ శరణాలయం, బాలుర శరణాలయ గృహం అన్యాక్రాంతమవుతున్నాయనిథా సంస్థ పవరాఫ్ అటార్నీ జీఎస్ ఆనంద్, ప్రాంతీయ అధికారి బిషప్ జి.అబేద్నగో ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోర్టు వివాదంలో ఉన్న ఈ ఆస్తులను ఎవరైనా కొనుగోలు చేసినా, లీజుకు పొందినా, మార్పులు చేర్పులు చేసినా నష్టపోతారన్నారు. ఇంజెక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ దేవరపల్లి సోనీ సునంద్, మరికొందరు కలిసి బాలుర అనాథ గృహాన్ని అక్రమమార్గంలో అమ్మివేశారని మండిపడ్డారు. వంగా పుల్లా రెడ్డి, చాట్రాతి రామస్వామి అనేవారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఆ రిజిస్ట్రేషన్ రద్దు కోసం చర్చి కమిటీ రాజమహేంద్రవరం కోర్టులో కేసు వేసిందని, అయినా దౌర్జన్యంగా భవనాన్ని పడగొట్టి, కొత్త కట్టడాలు నిర్మిస్తున్నారన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సదస్సులో మాట్లాడుతున్న సత్యకుమార్

ధవళేశ్వరం: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యానేరమని డిప్యూటీ డెమో ఎస్.సత్యకుమార్ అన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీలో శుక్రవారం ఆశా కార్యకర్తలకు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసే సమావేశాల్లో పీసీపీఎన్‌డీటీ యాక్టుపై అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి మాట్లాడుతూ ఆడ, మగ బిడ్డలిద్దరూ సమానమని క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శేషామణి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి



నేతాజీనగర్‌లో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని ఏపీగ్రీనింగ్అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరు గ్రామసచివాలయం 4 పరిధిలోని నేతాజీ నగర్ ఏడోవీధి నుంచి శుక్రవారం రెండోరోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి చందన నాగేశ్వర్ ఇంటింటికీ పర్యటించారు. నాలుగేళ్లలో ప్రభుత్వంలో అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు తెలిపిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, సచివాలయ కన్వీనర్ కేవీ సుబ్బారెడ్డి, రాజేశ్వరి,తిరుపతిరాయుడు, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, సద్గుణ రామారెడ్డి, సోమన శ్రీను, దాకే శ్రీనివాస్, మత్స్రేటి శివ, తోడేటి రాజా, కాకులపాటి కుమార్, కోటిపల్లి రవి, రమేష్, జాలా మోషే, తోడేటి రాహుల్, వైఎస్ కుమార్, రమణ పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో నేషనల్ స్టాటిస్టిక్స్ డే

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నేషనల్ స్టాటిస్టిక్స్‌డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) డాక్టర్ భగవాన్‌దాస్ మాట్లాడారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనూరాధ సూర్యకుమారి, మ్యాథమెటిక్స్ విభాగాధిపతి సీవీ.ప్రసాద్, స్టేటస్టిక్స్ విభాగాధిపతి ఇ.కీర్తి, ఎం.వీర్రాజు, ఎంఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మంతెన గార్డెన్స్ వీధులు, సంగీత వెంకట్ రెడ్డి వీధులు, ప్రగతి మార్గ్, భాను టెక్స్‌టైల్స్ రోడ్, షిరిడీ సాయిమార్గ్, వాద్రేవు నగర్, జేఎన్ రోడ్డు, తిలక్ రోడ్డు, బ్యాంక్ కాలనీ, మోడల్ కాలనీ, శ్రీనగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

నేడు నగరంలో సేవా కార్యక్రమాలు

సీటీఆర్ఐ: గాడాలలోని మహాలక్ష్మి సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం నగరంలో పలు సామాజిక సేవా కార్యక్రమలు నిర్వహిస్తామని ట్రస్టు జాతీయ చైర్మన్ దుర్గా వెంకట హేమవతి అన్నారు. స్థానిక జయశ్రీ గార్డెన్స్‌లోని ట్రస్టు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వెయ్యిమందికి పైగా అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. ట్రస్టు సభ్యుడు మద్ది శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆకలితో ఉన్న వారి వద్దకే వెళ్లి అన్న ప్రసాదం అందజేస్తామన్నారు.

చదరంగం జాతీయ పోటీలకు సాయివిభు



ప్రకాశం నగర్: విజయనగరంలో గత 28 నుంచి 30 వరకూ జరిగిన అండర్ 7 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో నగరానికి చెందిన సాయివిభు సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పశ్చిమబంగాల్లో సెప్టెంబర్ 20 నుంచి జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి సాయివిభు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులు దొరబాబు, ఆనంద్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

కడియం: నవోదయ ప్రవేశ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేసిన దుళ్ల 1 పాఠశాల ఉపాధ్యాయుడు అన్యం దొరబాబు, హెచ్ఎం గెడ్డం ఆనంద్‌ను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో వి.లజపతిరాయ్ మాట్లాడుతూ ఈ పాఠశాల నుంచి పొన్నగంటి బబ్లూ, నామాల భావన, వేల్పూరి లక్ష్మీదీపక్ నవోదయకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. నవోదయకు ఎంపికైన విద్యార్థులకు కంటిపూడి కిరణ్‌కుమార్ రూ.3 వేలు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు ఆవుల పద్మజ వేదగణితం పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీని ఎంఈవో చేతుల మీదుగా అందించారు.

మహిళ మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక సాయికృష్ణ రివర్‌వ్యూ లాడ్జి ఎదురుగా ఉన్న పీవీ నర్సింహారావు పార్కు పక్కనే గోదావరి ఒడ్డున గుర్తుతెలియని 45 నుంచి 45 ఏళ్ల మహిళ మృతదేహాన్ని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం కనుగొన్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

తాపీమేస్త్రి అదృశ్యం

కంబాలచెరువు: జార్ఖండ్‌కు చెందిన సంజయ్ కూరీ స్థానిక ఏవీ రోడ్డులో నిర్మితమవుతున్న మల్టీప్లెక్స్ థియేటర్‌లో తాపీ పనిచేస్తున్నాడు. అయితే అతడు గత నెల 20వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. అతడి మేస్త్రీ రావు ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పలుకు సంస్థ కృషి అభినందనీయం



విద్యార్థులతో రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి పలుకు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. సంకల్పమ్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలుకు స్పీచ్ ట్రైనింగ్, బధిరుల ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు శుక్రవారం ఆమె చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు, వినికిడి యంత్రాలు, స్కూల్ బ్యాగులు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ పలుకు బధిరుల పాఠశాలకు వచ్చి విద్యార్థుల మధ్యగడపడం ఆనందంగా ఉందన్నారు. ఐదుగురు విద్యార్థులకు పట్టాలు అందించారు. పలుకు సంస్థలో చదువు పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులందరూ అన్నదానం నిర్వహించారు. సంస్థ నిర్వాహకురాలు ఘంటా కనకదుర్గ పాల్గొన్నారు.

విద్యాకానుక నూరుశాతం పంపిణీ చేయాలి

కంబాలచెరువు: జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులందరికీ నూరుశాతం పంపిణీ చేయాలని రాజమహేంద్రవరం మండల విద్యాశాఖాధికారి 2 రమా రజని అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించి, జేవీకే కిట్ల పంపిణీని పరిశీలించారు. విద్యార్థుల బూట్ల కొలతలను స్వయంగా పర్యవేక్షించారు. ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుక అందజేయాలన్నారు. షూ కొలతలు తేడా ఉన్న విద్యార్థుల వివరాలను కార్యాలయానికి అందజేస్తే త్వరలో పాఠశాలకు పంపిణీ చేస్తామన్నారు. జేవీకే రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్పీ జయంతి శాస్త్రి, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్, ఏఎల్.నరసింహారావు పాల్గొన్నారు.